


# టాగోర్ కథలు

తెలుగు సేత : చంద్రలత



## తపాలాధికారి                రవీంద్రనాథ టాగోర్

పోస్ట్ మాస్టర్ (బెంగాలీ,1891)



తపాలాధికారి మొదటి ఉద్యోగం ఊలాపూర్ అనే పల్లెటూరిలో. అది చిన్నపల్లె. అయినా, దగ్గరలో ఒక నీలి దొడ్డి (1) ఉంది. ఆ నీలిదొడ్డి యజమాని ఆంగ్లేయుడు. అతని ప్రాబల్యంతో అక్కడ ఒక తపాలా కార్యాలయాన్ని స్థాపించారు. మన తపాలాధికారి కలకత్తావాడు. ఈ మారుమూల పల్లెటూరికి రావడంతో, నీళ్ళలో నుంచి తీసి బయటకు విసిరేసిన చేపలా విలవిలలాడిపోతున్నాడు.

అతని కార్యాలయం, బస రెండూ కూడా వెదురువాసాలపై దిట్టంగా కప్పిన రెల్లు కప్పు వేసిన పాకలోనే. ఆ దరిదాపుల్లోనే ఒక పాచిపట్టి శుష్కించిన దొరువు. దాని చుట్టూ దట్టంగా అల్లుకొన్న చెట్టూచేమ. కంపాగోడు.

నీలిదొడ్డిలో పనిచేసేవారికి తీరిక ఉండదు. పై నుంచి వారెవరు మర్యాదస్తులతో స్నేహం చేసేట్టుగా కనిపించడం లేదు. పైనుంచి, ఈ కలకత్తాకుర్రాడికి సాటివారితో కలిసిమెలిసి ఉండే కళ తక్కువ. కొత్తవారికి అతనొక అహంభావిగానో, అనారోగ్యంతో బాధపడే వారి లాగానో కనిపిస్తాడు. ఏ లెక్కన చూసినా, తపాలాధికారికి స్నేహితులు అనదగ్గవారు ఎవరూ లేరు. అతను చేయడానికి ఏమీలేదు.

అప్పుడప్పుడు నాలుగు వాక్యాలను గిలికి, కవితల్లా రాయాలని ప్రయత్నిస్తాడు. ఆకుల కదలికలు, ఆకాశంలో మేఘాలు వంటివి అతని జీవితంలో సంతోషం నింపడానికి చాలు. ఇలాంటి భావనలలో పుట్టిన గాఢానుభూతికి అక్షరరూపం ఇవ్వాలని అనుకొనేవాడు. కానీ, ఆ పై వాడికి తెలుసు. ఈ అభాగ్యుడికి కొత్త జీవితం ఎప్పుడు వస్తుందో. చుట్టూ అలముకొన్న ఆ చెట్లుపొదలను చెలిగేసి, చక్కగా యంత్రాలు వేసే రహదారి పడినపుడు, అరేబియా



రాత్రుల కథల్లోని జీని భూతంలా ఆ పొదలన్నీ మాయం చేసి, మేఘాలను కనబడనివ్వని ఆకాశహర్మ్యాలతో నిండినపుడు వస్తుందేమో!

తపాలాధికారికి జీతం బొటాబొటిగా వచ్చేది. అతని వంట అతనే చేసుకోవాల్సి వచ్చేది. అతని వంటపనిని రతన్‌తో పంచుకొనేవాడు. రతన్ ఒక అనాథ బాలిక. అతని వంటపనిలో సాయపడేది. అతని ఇంటిపనుల్లో చేతికందుబాటులో ఉండేది.

సాయంకాలం పల్లెలోని పశువులకొట్టాల మీదుగా గొట్టాలలో నుంచి మెలికలు తిరుగుతూ పొగ పైకి వచ్చినపుడు——కీచురాళ్ళు ప్రతి పొదలో నుంచి అరుస్తూ రొదపెట్టినపుడు——బావుల్ గాయకులు తమ రోజువారీ సమావేశాల్లో గొంతెత్తి పాడడం మొదలెట్టినపుడు——ఏ కవి అయినా చూడాలని ప్రయత్నిస్తే, దట్టమైన వెదురు పొదల్లో నుంచి సాగుతోన్న ఆకుల సవ్వడి వెన్నులో వణుకు పుట్టించి భయపెట్టేవేళ——తపాలాధికారి చిన్న దీపం వెలిగించి బిగ్గరగా కేకేస్తాడు, "రతన్!"

ఆ పిలుపుకోసమే వేచిఉన్నట్టుగా, ఒక్కసారిగా లోపలకి రాకుండా బదులిచ్చేది, "నన్ను పిలిచారా, దాదా (2)?"

"ఏం చేస్తున్నావ్?" తపాలాధికారి అడుగుతాడు.

"పొయ్యి రాజేయబోతున్నాను," అన్నది సమాధానం.

"పొయ్యి తరువాత వెలిగిద్దువులే, ముందు నా పైపు వెలిగించి ఇవ్వు!"

ఎట్టకేలకు రతన్ ఇంటిలోనికి ప్రవేశిస్తుంది, పొగాకు చుట్టను వెలిగించడానికి. పొయ్యిని పొగ గొట్టంతో ఊది ఊది ఆమె బుగ్గలు ఊరిపోయి ఉంటాయి. అప్పటికి తపాలాధికారికి మాట్లాడే అవకాశం వస్తుంది.

"అది సరేగానీ, రతన్," తపాలాధికారి అడగడం మొదలుపెడతాడు, "మీ అమ్మ గురించి నీకేమైనా గుర్తుందా?"

అదొక పండిపోయిన విషయం. పన్నెండేళ్ళ రతన్ కి కొన్ని సంగతులు జ్ఞాపకం ఉన్నాయి. మరికొన్ని గుర్తు లేవు. వాళ్ళ అమ్మ కన్నా నాన్న ఆమెను ఎక్కువ గారాబం చేసేవాడు. నాన్నను ఆమె బాగా గుర్తు పెట్టుకొన్నది.

రతన్ వాళ్ళ నాన్న పనవ్వగానే నేరుగా ఇంటికి వచ్చేవాడు. అలాంటి ఒకటి రెండు సాయంకాలాలు రతన్ మనసులో చెరగని చిత్రాల్లా ముద్రించుకుపోయాయి. ఆ చిత్రాలు తన మనసులో మెదలుతుంటే, రతన్ ఆ తపాలాధికారి కాళ్ళ దగ్గర చతికిలబడి కూర్చునేది. ఏదో మేఘాలు కమ్మిన రోజున ఆ దొరువు ఒడ్డున కూర్చొని, తన తమ్ముడితో చేపలు పట్టే ఆట ఆడడం గుర్తొచ్చేది. పుల్లను గుచ్చి ఉత్తుత్తి గాలం చేసుకొని ఆడుకొన్న ఆనాటి అమాయకత్వం ఆమెను కమ్మేసేది.

అలాంటి చిన్న చిన్న జ్ఞాపకాలు ఆమె మనసును బాధించే పెద్ద దుర్ఘటనల జ్ఞాపకాలను తుడిచి పెట్టేసాయి. అలా తపాలాధికారితో మాట్లాడుతుంటే, కాలం ఇట్టే దొర్లిపోయేది. కబుర్లతో కడుపు నిండిన తపాలాధికారికి వంటచేయడానికి బద్ధకం వేసేది. అప్పుడు రతన్ హడావుడిగా పొయ్యి రాజేసి, ఆదరాబాదరాగా రొట్టెలు కాల్చేది. పొద్దున వంటలో మిగిలిన కూరానారని వేడి చేసుకోవడంతో, వారి రాత్రి భోజనం పూర్తయ్యేది.

కొన్ని సాయంకాలాలు ఖాళీకొట్టం ముందున్న తన బల్ల వద్ద వంటరిగా కూర్చున్నప్పుడు, తపాలాధికారిని అతని ఇంటి జ్ఞాపకాలు చుట్టుముట్టేవి. అతని అమ్మా చెల్లెలు గుర్తుకు వచ్చేవారు. వారికి దూరంగా ఉద్యోగమంటూ ఇలా ఏకాంతవాసం చేయడం, వారి బాగోగుల కోసమే. అది తలుచుకొంటే అతని మనసు విషాదంతో నిండిపోతుంది. వారి జ్ఞాపకాలు ఎప్పుడు అతనిని వెన్నంటి ఉండేవి. వాటన్నిటినీ ఫ్యాక్టరీ మనుషులతో పంచుకోలేకపోయే వాడు.

ఆ చిన్నపిల్ల రతన్ తో సహజంగా పంచుకొనేవాడు. ఎంతగా చెబుతూ పోయేవాడంటే, ఆ అమ్మాయికి అతని కుటుంబ సభ్యులు——అమ్మ, అన్న, చెల్లెలు——తనకు జీవితాంతం తెలిసినట్టే అనిపించేంతగా. వాస్తవానికి, వారందరి సజీవమూర్తులను రతన్ తన మనసులో చిత్రించుకొంది.

ఒక వానాకాలం మధ్యాహ్నం. చల్లటి గాలి వీస్తోంది. ఎండలో ఆరుతోన్న తడిచిన గడ్డిగాదం ఆకుఅలం వాసనను మోసుకొస్తోంది. తడిచిన భూమితల్లి వెచ్చని ఊపిరి వంటిని తాకుతున్నట్లుగా ఉంది. ప్రకృతి శ్రోతల వేదిక మీద నిలబడి ఫిర్యాదుచేస్తున్నట్టుగా, ఒక పక్షి ఆ మధ్యాహ్నమంతా ఆపకుండా గొంతెత్తి కువకువ రాగాలు తీస్తూనే ఉంది.

తపాలాధికారికి చేసే పనేమీ లేదు. వాన కడిగిన ఆకుల తాజాదనపు మెరమెరలు, వాన కురిపించిన మేఘాలగుంపులు అల్లనమెల్లన తిరిగి వెళ్ళే అందచందాలు, ఎదురుగా కళ్ళకింపైన సుందరదృశ్యాలు.

తపాలాధికారి వాటివంకే కళ్ళార్పకుండా చూస్తూ తనలో తనే ఆలోచిస్తున్నాడు, “ఇలాంటివేళ దగ్గరలో ఎవరైనా ప్రియమైన వ్యక్తి, హృదయానికి హత్తుకొనే వ్యక్తి ఉంటే ఎంత బావుండేది!” అతని ఆలోచనలు ఆగకుండా సాగిపోతున్నాయి. ఆ పక్షి ఆ మాటే చెబుతుందేమో! ఖచ్చితంగా! ఆ గుసగుసలాడే ఆకులు కూడా అదే విషయాన్ని చెప్పాలని ప్రయత్నిస్తున్నాయి. కానీ, ఎవరికీ తెలియదు. తెలిసినా నమ్మరు. అలాంటి సుందర భావన ఈ బొటాబొటి జీతగాడైన పల్లెటూరి తపాలాధికారిని ముంచెత్తుతుందని అసలు నమ్మనే నమ్మరు. అదీ నిగూఢమైన నిశ్శబ్దం నిండిన మధ్యాహ్న ఉద్యోగ విరామవేళలో!

తపాలాధికారి నిట్టూర్చాడు. ఏదో గుర్తొచ్చినట్టు బిగ్గరగా పిలిచాడు, “రతన్!”

రతన్ అప్పుడు జామచెట్లతో దోబూచులాడుతోంది. దోర ముగ్గిన జామపండ్లను తినే సందడిలో. తన యజమాని పిలుపు వినబడగానే, ఊపిరి ఉగ్గబెట్టి ఉరుకులూపరుగుల మీద అతని వద్దకు వచ్చి అడిగింది, “నన్ను పిలిచారా, దాదా?”

“నేను ఆలోచిస్తున్నాను,” తపాలాధికారి అన్నాడు, “నీకు చదవడం నేర్పిద్దాం అని!”

అలా, ఆ మధ్యాహ్నమంతా రతన్ కి ఓనమాలు దిద్దించాడు. అతికొద్ది సమయంలోనే రతన్ గుణింతాలు, వత్తులు రాసే దాకా నేర్చేసుకొంది.

ఈ వానాకాలం వానలు ఎన్నటికీ ఆగేట్టు లేవు. కాలువలు, దొరువులు, కుంటలు అన్నీ పొంగిపొర్లుతున్నాయి. రాత్రింబవళ్ళు వానచినుకుల సవ్వడి, కప్పల బెకబెకలు వినబడుతూనే ఉంటున్నాయి. ఆ పల్లెటూరి దారులన్నీ నీటిమయమై పోయాయి. రోజువారీ పనులనీ, వ్యాపార వ్యవహారాలని చిన్నచిన్న తెప్పలలో వెళ్ళి చేసుకొంటున్నారు.

బాగా ముసురు పట్టిన ఓ ఉదయాన, తపాలాధికారి చిన్నారి శిష్యురాలికి ఎంతకీ పిలుపు రాకపోయే సరికి, గడపకి అవతలే తలుపుకు ఆనుకొని వేచి ఉంది. ఆ నిశ్శబ్దం ఆమెకి అసాధారణంగా తోచింది. మడతపెట్టడంతో నలిగిన తన పుస్తకాన్ని చేతబట్టుకొని, మెల్లిగా గడపలోకి అడుగుపెట్టింది.

ఆమె యజమాని మంచం మీద వెల్లకిల పడుకొని ఉన్నాడు. ఆలోచిస్తున్నానని అతను అనుకొన్నాడు. అతను విశ్రాంతి తీసుకొంటున్నాడని ఆమె అనుకొంది. మునివేళ్ళ మీద చప్పుడు చేయకుండా బయటకు నడిచింది.

"రతన్!" మెల్లిగా తనపేరు వినబడే సరికి, గిరుక్కున వెనక్కి తిరిగి అడిగింది, "పడుకొన్నారా, దాదా?"

తపాధికారి నీరసంగా అన్నాడు, "అహ, లేదు. నా తల తేలిపోతోంది. నుదురు వేడిగా ఉందా?"

ఏకాంతప్రవాసంలో జ్వరపడిన అతని శరీరం, సున్నితమైన ఉపచారాన్ని కోరుకొంటోంది. జ్వరంతో మండిపోతున్న అతని నుదుటి మీద చల్లగా స్పృశించే అతని అమ్మ, చెల్లెలి చేతిస్పర్శకోసం అతను తపించసాగాడు. అలా స్పృశించేటప్పుడు వారి చేతిగాజుల సవ్వడి అతనికి గుర్తుకు వస్తోంది. అమ్మ, చెల్లెలు అతని పక్కన లేరన్న దిగులుకూడా అతనిని కమ్మేస్తోంది. ప్రవాసాన ఆ లోటును ఈ చిన్నారి బాలిక, రతన్, పూరించింది.

రతన్ ఒక్కసారిగా అతని తల్లి పాత్రలోకి ప్రవేశించింది. ఊరిలోని వైద్యుడిని పిలుచుకు వచ్చింది. వైద్యుడు ఇచ్చిన గుళికలను వేళపట్టున వేసింది. అతని తలగడ పక్కనే రాత్రంతా కూర్చుంది. జావకాసి తాగించింది. కాసేపటికి ఒకసారి బాగోగులు ఆరాతీసింది, "ఎలా ఉంది, దాదా? కొంచమైనా నెమ్మదించిందా? జ్వరం తగ్గిందా?" అని అంటూ.

జబ్బుపడ్డ శరీరంతో మంచం మీద నుంచి లేచి తిరగడానికి తపాలాధికారికి కొంత సమయం పట్టింది. కాస్త నెమ్మది కుదరగానే, అతను ఒక నిర్ణయానికి వచ్చాడు, "ఇంక ఇదంతా అనవసరం! నాకు బదిలీ కావలసిందే!"

అతను వెంటనే కలకత్తాకి దరఖాస్తు పంపాడు, ఆ ప్రాంతంలోని అనారోగ్యపరిసరాలను వివరిస్తూ.

ఇక, తన పరిచర్యల ఉద్యోగం నుంచి విరామం దొరకగానే, రతన్ మళ్ళీ గడప అవతల తన పాతచోటుకి తిరిగి వెళ్ళింది. కానీ, తపాలాధికారి నుంచి మునుపటి పిలుపు మళ్ళీ రాలేదు. ఆమె ఒక్కోసారి చాటుమాటుగా గదిలోకి తొంగిచూసేది. తపాలాధికారి తన కుర్చీలో సాగిలబడి కూర్చునో, మంచం మీద బోర్లాపడుకొనో, అన్యమనస్కంగా గాల్లోకి చూస్తూనో కనబడేవాడు.

రతన్ అతని పిలుపుకోసం ఎదురు చూస్తుంటే, తపాలాధికారి తన దరఖాస్తు బదులు కోసం ఎదురు చూస్తున్నాడు. ఆ బాలిక పాతపాఠాలే మళ్ళీ మళ్ళీ చదువుకొంటోంది. ఎప్పుడు పిలిచి గుణింతాలు, ద్విత్వాక్షరాల పదాలు అడుగుతాడో అని భయపడుతూ ఉంది.

ఒక వారం ఇలా గడిచాక, చిట్ట చివరికి ఓ సాయంకాలం వేళ పిలుపు వచ్చింది. ఉప్పొంగే హృదయంతో రతన్ ఒక్క పరుగున గదిలోకి వెళ్ళింది.

"నన్ను పిలిచావా, దాదా?"

"నేను రేపు వెళ్ళిపోతున్నాను, రతన్."

"మళ్ళీ తిరిగి ఎప్పుడు వస్తావు?"

"నేను తిరిగి రావడం లేదు."

రతన్ ఇక ఏ ప్రశ్నా అడగలేదు.

తపాలాధికారి తన ధోరణిలో తాను చెప్పుకుంటూ పోయాడు. అతని బదిలీ దరఖాస్తును తిరస్కరించారు. అందుకని అతను రాజీనామా చేసేశాడు. ఇంటికి తిరిగి వెళుతున్నాడు.

చాలాసేపటి వరకు ఇద్దరూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

దీపం చిన్నగా వెలిగీవెలగనట్లు వెలుగుతోంది. పై కప్పు ఖాళీల్లోంచి కింద పెట్టిన మట్టిపాత్రలోకి వాననీరు ధారగా పడుతోంది. కొద్ది సేపటి తరువాత రతన్ పైకి లేచింది. వంటింట్లోకి వెళ్ళి, వంట చేయడం మొదలు పెట్టింది. ఎప్పటిలాగా వంట చేయడానికి తొందరపడలేదు. నెమ్మదిగా నిదానంగా వండింది. ఆమె చిన్ని తలలో కొత్త సంగతులు తలెత్తాయి.

తపాలాధికారి భోజనం తినడం ముగించగానే, రతన్ హఠాత్తుగా అడిగింది, "దాదా, నన్నూ నీతో మీ ఇంటికి తీసుకువెళతావా?"

తపాలాధికారి నవ్వేసి అన్నాడు, "ఏం ఆలోచన!"

అంతలోనే, ఆ అమ్మాయికి వివరణ ఇవ్వడం అనవసరమనీ, వెర్రితనమనీ అనుకొన్నాడు.

ఆ రాత్రంతా ఆ అమ్మాయి మెలుకువతో ఉన్నట్టే ఉంది. ఆమె కలలో కూడా తపాలాధికారి నవ్వుతూ ఇచ్చిన బదులు వెంటాడింది. "ఏం ఆలోచన!"

తపాలాధికారి పొద్దున నిద్రలేచేసరికి తన స్నానానికి నీరు సిద్ధం చేసి ఉండడం గమనించాడు. కడవల్లో నీరు తెచ్చుకొని స్నానం చేయడం అతని కలకత్తా అలవాటు. ఆ ఊరివారికి నదిలో స్నానం చేయడం ఆనవాయితీ.

కారణం ఏమైనా, అతను ఏ వేళప్పుడు బయలుదేరుతున్నాడని రతన్ అడగలేదు. అందుకే తెల్లవారక మునుపే నదినుంచి నీళ్ళు తెచ్చి కడవలు నింపింది. ఎంత పొద్దున అతనికి కావలసి వచ్చినా సిద్ధంగా ఉంటాయని.

తపాలాధికారి స్నానం పూర్తయ్యాక, రతన్ కి పిలుపు వచ్చింది. రతన్ నిశ్శబ్దంగా లోపలికి వెళ్ళింది. మౌనంగా యజమాని ఉత్తర్వులకోసం అతని ముఖంలోకి చూసింది.

"నేను వెళ్ళి పోతున్నానని ఆందోళన పడక్కర లేదు, రతన్. నా తరువాత వచ్చే ఉద్యోగికి నిన్ను బాగా చూసుకోమని చెబుతాను."

ఈ మాటలు ఎంతో దయతో పలికినవి. కరుణతో నిండినవి. అయితే, ఆడవారి మనసు నిగూఢమైనది.

రతన్ లోగడ తన యజమానితో ముక్కచీవాట్లు తినింది, ఎలాంటి ఫిర్యాదులు లేకుండా. కానీ, ఈ కరుణార్ద్ర పదాలను ఆమె భరించలేక పోయింది. ఒక్కసారిగా ఏడవడం మొదలుపెట్టింది.

"వద్దొద్దు! నా గురించి ఎవరికీ ఏమీ చెప్పొద్దు. నేనిక్కడ ఉండదలుచుకో లేదు."

తపాలాధికారి నిర్ఘాంతపోయాడు. అతను రతన్ ని ఎప్పుడూ ఇలా చూడలేదు.

కొత్త ఉద్యోగి సమయానికి వచ్చేసాడు. తన పనులన్నిటినీ అతనికి అప్పజెప్పేసి, ఊరికి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

బయలుదేరే ముందు రతన్ ను పిలిచి అన్నాడు, "ఇదుగో, ఇది నీకోసం. కొంతకాలం గడుస్తుంది." అతను తన జేబులోనుంచి తన నెలజీతం మొత్తం తీసాడు. దారిఖర్చులకు ఉంచుకొని, మిగిలినదంతా రతన్ కు అందించాడు.

రతన్ ఒక్కసారిగా అతని పాదాల మీద కుప్పకూలి, గొల్లుమంది.

"ఓ దాదా! నాకేమీ ఇవ్వొద్దు! నా కోసం ఏ ఇబ్బందీ పడొద్దు!" అలా అంటూనే కళ్ళకి కనబడకుండా పరిగెత్తింది.

తపాలాధికారి భారంగా నిట్టూర్చాడు. తన సామాన్ల గోనెసంచిని తగిలించుకొని, పరుపుచుట్టని తీసుకొని, గొడుగుని భుజాన వేలాడేసుకొన్నాడు. అతని రంగురంగుల రేకుపెట్టెని ఓ వ్యక్తి మోస్తుండగా, మెల్లిగా పడవవైపు నడిచాడు.

పడవలోకి ఎక్కి, ముందుకి సాగాడు. నిండుగా ప్రవహిస్తూన్న నది, తన గాయాలను తట్టుకొంటూ కుములుతూ వెక్కిళ్ళు పెడుతున్న భూదేవి కన్నీళ్ళు పొంగిపొర్లుతున్నట్లుగా తోచింది. అప్పుడు అతని మనసులో బాధ కలుక్కుమంది. విషాదంలో మునిగిన ఆ పల్లెటూరి బాలిక ముఖాన, తీవ్రదుఃఖంలో మునిగిఉన్న భూమాత కనబడింది.

ఒక్కసారిగా వెనక్కి వెళ్ళి, ఆ ఏకాంతవాసిని ఈ లోకాన పడేసిన ఆ బాలికను తనతో తీసుకెళదాం అనుకొన్నాడు. కానీ, అప్పటికే గాలి తెరచాపలలో నిండింది. పడవ ముందుకు సాగింది. సుళ్ళు తిరుగుతున్న నీటిలో నది మధ్యగా సాగుతోంది. పల్లె వెనక్కి వెళ్ళి పోయింది. ఊరి చివరి స్మశానవాటిక కనబడుతోంది.

దానితో ఆ ప్రయాణీకుడు వేగంగా పారుతోన్న నీటిప్రవాహాన్ని చూస్తూ తనను తాను ఓదార్చుకొన్నాడు. ఈ లోకంలో లెక్కలేనన్ని కలయికలు, వీడ్కోళ్ళు జరుగుతూ ఉంటాయి. మరణం అంతిమ వీడ్కోలు. అక్కడికి వెళ్ళిన వారెవరూ తిరిగి రాని వీడ్కోలు అది.

కానీ, రతన్ లో ఏ తాత్వికతా లేదు. కన్నీళ్ళు నిండిన కళ్ళతో తపాలా కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. ఎక్కడో ఆమె మనసు మూలలో దాదా తిరిగి వస్తాడన్న నమ్మకం కొట్టుమిట్టాడుతుంది. ఆ ఆశతోనే తనను తాను బద్దలు చేసుకోలేదు.

పాపం, మతిలేని మానవస్వభావం! దానికి నచ్చిన తప్పులు పదే పదే చేస్తుంది. సత్యాలు కళ్లకెదురుగా ఉన్నా నమ్మకం కుదరదు. ఉత్తుత్తి ఆశ మనసుని అంటి పెట్టుకొని ఉంటుంది. చివరికో రోజు వస్తుంది. గుండెను పీల్చి పిప్పి చేసి, బలవంతంగా అన్ని బంధాల నుంచి విముక్తి చేసి, వెళ్ళి పోతుంది. ఆ తరువాత మెలుకువ కలిగించే బాధ వస్తుంది.

మళ్ళీ అవే తప్పులు చేయడానికి చిక్కు దారి విచ్చుకొంటుంది.

Foot Notes: 1.ఇండిగో ఫ్యాక్టరీ 2. అన్న

## అనుసృజకుల వ్యాఖ్యానం

మనిషికి మనిషి తోడు.ఇద్దరు ఏకాంతజీవుల సాన్నిహిత్యంలోని మానవసంబంధానికి ఇదొక సున్నిత చిత్రణ. ప్రవాసి ఒకరు. అనాథ మరొకరు. పనిపాటలు చేసుకొనే పల్లెపిల్లలో చదువుకోవాలన్న జిజ్ఞాసని కలిగించిన చిరుద్యోగి కథ ఇది. చదువుతో, గురువుతో ఏర్పడ్డ ఆ హృద్యమైన అనుబంధం మాటలకందనిది.ఆయా వ్యక్తులకే అర్థంకానిది.

బాలకార్మిక వ్యవస్థను, బాలికావిద్య మూలాలని తడిమే కథ.

★★★

COMMENTS